క్లుప్తంగా

25 శాతం ఉచిత సీట్లకు దరఖాస్తు చేసుకోండి

వంగర: కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో ఖండాపు జగదీశ్వరి ఓ ప్రకటనలో గురువారం కోరారు. స్థానిక వివేక్ మాస్టర్ మైండ్స్, డేనియల్ ఆర్సీఎం హైస్కూళ్లల్లో ఒకటో తరగతిలే చేరేందుకు అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలన్నారు.అనాథలు, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారు అర్హులన్నారు.

పుస్తకాల స్టాక్ పాయింట్ పరిశీలన



పుస్తకాలు పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

మెంటాడ: మండలంలోని చల్లపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పుస్తకాల స్టాక్ పాయింట్‌ను విద్యాశాఖాధికారులు గురువారం పరిశీలించారు. ఏఎంవో వి.ఆదినారాయణ, సహాయ ఏఎంవో కె.రామారావు, ఎంఈవో పీఎస్‌పీ వర్మలు స్టాక్ పాయింట్‌లోని పుస్తకాలు చూసి, ఏయే పుస్తకాలు వచ్చాయి.. ఇంకా ఏవైనా పుస్తకాలు రావాల్సి ఉందా అని ఆరాతీశారు. విద్యాసంవత్సరం ఆరంభం రోజే పుస్తకాలు విద్యార్థులకు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఇద్దనవలసలో పెట్రోలుబంకు ప్రారంభం



పెట్రోలుబంకు ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య

మెంటాడ: మండలంలోని ఇద్దనవలస గ్రామంలో ఐవోసీ(ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్) పెట్రోలుబంకును మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యలు కలిసి గురువారం ప్రారంభించారు. వాహనదారులకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాయిపల్లి రామారావు, వైస్ ఎంపీపీ సారికి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సీసీ రోడ్డు నిర్మాణం



సీసీ రోడ్డు నిర్మాణ పనులు

రేగిడి: మండలంలోని లక్ష్మీపురంలో సీసీ రోడ్డు నిర్మాణం చురుగ్గా కొనసాగుతోంది. ప్రతి పంచాయతీకి జెడ్పీటీసీ పాలవలస ఇందుమతి, ఎంపీపీ దార అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావులు మంజూరు చేయించిన మండల పరిషత్ నిధులతో గ్రామగ్రామాన సీసీ రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నారు.

12న మెగా జాబ్‌మేళా

గజపతినగరం : ఏపీ స్కిల్ డవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 12న గజపతినగరం పురిటిపెంట బాలికోన్నత పాఠశాలలో మెగాజాబ్ మేళాను నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాధికారి ప్రశాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో పాల్గొనేందుకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ, బీటెక్‌లో ఉత్తీర్ణత సాధించి 18ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు వయస్సు కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. జాబ్ మేళాకు 35 బహుళజాతి కంపెనీలు హాజరవుతున్నాయని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాల కోసం బాలికోన్నత పాఠశాల సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

శ్యామలాదేవి పేరంటాల ఆలయంలో పూజలు

బొండపల్లి: మండలంలోని గొల్లుపాలెం గ్రామంలో శ్యామలదేవి పేరంటాల ఆలయంలో గురువారం వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు.

నాడు సంక్షేమం.. నేడు అరాచకం..

● మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: రాష్ట్రంలో నాడు వైఎస్సార్ సీపీ పాలనలో సంక్షేమ పాలన కొనసాగిందని, నేడు కూటమి పాలనలో అరాచక పాలన జరుగుతోందని వైఎస్సార్ సీపీ బొబ్బిలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు విమర్శించారు. మండల కేంద్రంలో మాజీ ఏఎంసీ డైరెక్టర్, పార్టీ మండల ఆర్యవైశ్య సంఘం నాయకుడు పొట్టా రామారావుకు చెందిన పెట్రోలు బంకును ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో కాసేపు మాట్లాడారు. ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే అభివృద్ధి, సంక్షేమంతో రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తామని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఒక్క సంక్షేమ పథకం అమలు చేయలేదన్నారు. ఉచిత బస్సు పథకం, తల్లికి వందనం, 18 ఏళ్ల నిండిన మహిళలకు రూ.1500 తదితర పథకాలు అమలు ఎక్కడని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు సంపద సృష్టిస్తానని చెప్పి ఏడాది కాకముందే రూ.1,47 కోట్లకు పైబడి అప్పు చేశారన్నారు. సంపద సృష్టిస్తానన్న వ్యక్తి అప్పులు చేయడమేంటని నిలదీశారు. గతంలో వైఎస్సార్‌సీపీ హయాంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు పక్కాగా అందాయన్నారు. కూటమి అధికారం చేపట్టిన తర్వాత బొబ్బిలి నియోజకవర్గంలో ఇప్పటి వరకు చెసప్పుకోదగ్గ ఒక్క అభివృద్ధి పనీ జరగలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే పారాది వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ లోపు ఎన్నికలు రావడంతో పనులు ఆగాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నాయకులు నిర్మాణానికి మళ్లీ శంకుస్థాపన చేశారన్నారు. రామభద్రపురం-బొబ్బిలి రోడ్డు గుంతలమయంగా మారి వాహనదారులు అలా ఇబ్బందులు పడుతుంటే పట్టించుకునే నాథుడే కరువయ్యాడని దుయ్యబట్టారు. ప్రభుత్వంపై అన్నివర్గాల ప్రజల్లో అసంతృప్తి మొదలైందన్నారు. తగిన బుద్ధి చెప్పేందుకు మళ్లీ ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయులు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గణితం పట్ల భయం వీడాలి



గణితశాస్త్రాన్ని బోధిస్తున్న విశ్రాంత ఎంఈవో సత్యనారాయణ

తెర్లాం: గణితం పట్ల నెలకొన్న భయాన్ని వీడాలని విశ్రాంత ఎంఈవో, గణితశాస్త్ర ఉపాధ్యాయుడు మండాది సత్యనారాయణ విద్యార్థులకు సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన గురువారం సందర్శించి, అక్కడి విద్యార్థులకు సులభమైన పద్ధతిలో లెక్కలు ఏ విధంగా చేయాలో నేర్పించారు. చాలా మందికి గణితం అంటే భయమని, ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో చిన్నారులకు పుస్తక పఠనం, వక్తృత్వం, చిత్రలేఖనం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

పాత పెన్షన్ అమలు చేయాలని పోస్టుకార్డు ఉద్యమం



పోస్టుకార్డులు ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

బొబ్బిలి: డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పాతపెన్షన్ విధానం అమలుచేయాలని డీఎస్సీ-2003 ఉపాధ్యాయుల ఫోరం కన్వీనర్ ఎస్.రవి, కె.సింహాచలం డిమాండ్ చేశారు. ఇదే విషయమై పోస్టుకార్డు ఉద్యమం గురువారం చేపట్టారు. మండల కేంద్రంలోని పోస్టాఫీసుకు వెళ్లి, ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన ఉత్తరాలు(పోస్టుకార్డులు) పోస్ట్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57 అనుసరించి, పాతపెన్షన్ విధానం అమల్లోకి తీసుకురావాలని వారు కోరారు.

20న దేశవ్యాప్త సమ్మె



బొబ్బిలి: మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

రాజాం సిటీ: కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఈ నెల 20వ తేదీన చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకుడు సీహెచ్ రామ్మూర్తినాయుడు కోరారు. ఇదే విషయమై స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గురువారం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖలు, వివిధ సంస్థల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, అబ్కాస్‌లలో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి, కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. కార్మికుల హక్కులకు భంగం కలిగే చర్యలను మానుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పడాల లక్ష్మి, అనీల్‌కుమార్, బాలరాజు పాల్గొన్నారు.

బొబ్బిలి: లేబర్ కోడ్‌ల రద్దు లక్ష్యంగా ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్త సమ్మె చేయనున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు తెలిపారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మిని గురువారం మండల కేంద్రంలో కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఆయన వెంట యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.గౌరీశు, జె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

యూరియా వినియోగం తగ్గించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

రేగిడి: పంటల సాగులో యూరియా వినియోగం తగ్గించాలని ఏడీఏ చంద్రరావు రైతులకు సూచించారు. మండలంలోని పారంపేట, మునకలవలస గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. సేంద్రియ ఎరువులు వేసుకుని పంటలు పండిస్తే తెగుళ్లను తట్టుకుని, అధిక దిగుబడులు వస్తాయన్నారు. అలాగే నేల సారవంతానికి నవధాన్యాలు సాగు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏవో మురళీకృష్ణ పాల్గొన్నారు.

కొట్టక్కిలో రూ.7 కోట్లతో పారిశ్రామిక పార్కు



సచివాలయ సేవలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి గ్రామంలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో 10 ఎకరాల్లో రూ.7 కోట్ల నిధులతో పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. ఆ గ్రామ సచివాలయాన్ని గురువారం సందర్శించిన ఆయన.. సచివాలయాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించాలని, ప్రజాసమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించవద్దని ఎమ్మెల్యే సూచించారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించాలని కోరారు. స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యంగా గ్రామస్థాయి ఉద్యోగి నుంచి మండల స్థాయి ఉద్యోగి వరకు అందరూ బాగా పనిచేయాలన్నారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

వైభవంగా శ్రీనివాసుని కల్యాణోత్సవం



కల్యాణం చేస్తున్న అర్చకులు

బొబ్బిలి: స్థానిక కంచర వీధిలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణం తిలకించేందుకు పెద్దఎత్తున భక్తులు పోటీపడ్డారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి

వంగర: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజాసమస్యలపై దృష్టిసారించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎస్.రఘునాథాచారి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులతో గురువారం సమావేశమైన ఆయన.. వేసవి నేపథ్యంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని, పారిశుధ్యంపై అవగాహన కల్పించాలని, ఐదేళ్ల వయసులోపు చిన్నారులందరి ఆధార్‌కార్డు చేయించాలని, సిటిజన్ ఈకేవైసీ పూర్తి చేయించాలని, పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని తెలిపారు.

కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన

రేగిడి: మండలంలోని ఉంగరాడ గ్రామంలో కుష్టువ్యాధి నిర్మూలనపై గురువారం అవగాహన కల్పించారు. రేగిడి పీహెచ్‌సీ సూపర్‌వైజర్ అప్పారావు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలంతా కలిసి వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలను ప్రజలకు వివరించారు. చర్మంపై స్పర్శ లేని మచ్చలు, రాగిరంగు మచ్చలు, కాళ్లు పూర్తిగా మూసుకోకపోవడం, చెవి తమ్మెలు మందంగా తయారుకావడం వంటివి వ్యాధి లక్షణాలు అని, వీటిల్లో ఏవైనా కనిపిస్తే తక్షణమే ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవడం ద్వారా నయం చేసుకోవచ్చని తెలిపారు.

అన్నదానం

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి గ్రామంలో పార్వతీ పేరంటాలమ్మ ఆలయ ప్రతిష్టా మహోత్సవం సందర్భంగా గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం మధ్యాహ్నం భక్తులకు అమ్మవారి అన్నప్రసాదం అందజేశారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతిలు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న రఘునాథాచారి

వంగర: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా ఎస్.రఘునాథాచారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడి ఏవో ఎల్.త్రినాథ్ ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా వ్యవహరించగా ఇప్పుడు ఆయన ఎంపీడీవోగా పదోన్నతిపై చీపురుపల్లి వెళ్లారు. ఈ మేరకు సంతకవిటి ఏవో రఘునాథాచారిని వంగర ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.300

సంతకవిటి: నిర్దేశిత కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.300 వేతనం గిట్టుబాటు అవుతుందని ఏపీవో ఆర్.హరనాథరావు తెలిపారు. మండల కేంద్రంలోని ఈదులవాని చెరువు వద్ద జరుగుతున్న పనులను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం వేతనదారులకు పలు సూచనలు చేశారు. రోజుకు రెండు పూటలా పనిచేయాలని, చల్లని వేళల్లోని పని చేసుకోవాలన్నారు.



వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో హరనాథరావు

ఘనంగా ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం



రాజాం: డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



బొబ్బిలి: డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

బొబ్బిలి: స్థానిక రోటరీ క్లబ్ కార్యాలయంలో ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన ప్రపంచానికి రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా అందించిన సేవలను సభ్యులు కొనియాడారు.

రాజాం: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని, దీనికి సమాజ భాగస్వామ్యం పొంది, అభ్యుదయ పథంలో నడిచి సత్ఫలితాలు సాధిస్తామని రెడ్‌క్రాస్ సొసైటీ రాజాం శాఖ చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ విశ్వాసం వ్యక్తం చేశారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం గురువారం నిర్వహించారు. హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గ్రామం కంపు కొడుతోంది..



రాజాం మండలం, పొగిరి గ్రామం కంపు కొడుతోంది.. గ్రామంలోని రెల్లి వీధి రోడ్డులో గత వారం రోజులుగా మురుగునీరు ప్రవహిస్తోంది. దాని నుంచి వచ్చే దుర్వాసనను గ్రామస్తులు భరించలేకపోతున్నారు. ముఖ్యంగా అక్కడి వీధి వాసులు ముక్కు మూసుకుని మరీ వారి ఇళ్లకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీనంతటికీ గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉండడమే కారణంగా తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, కాలువల్లోని పూడికలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. -రాజాం సిటీ

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి



లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు పి.శంకరరావు డిమాండ్ చేశారు. బొబ్బిలి ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జరిగిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశానికి హాజరైన ఆయన..కార్మికులను కట్టుబానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తుండడం దురదృష్టకరమన్నారు. మనమంతా దీనిని వ్యతిరేకించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అలాగే ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లకు నెలకు రూ.26 వేలు చొప్పున కనీస వేతనం అందించాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నామని, ప్రతి కార్మికుడు ఈ సమ్మెలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. అనంతరం ఏపీవో లక్ష్మీపతిరాజుకు సమ్మె నోటీసు అందజేశారు. -బొబ్బిలిరూరల్

చినుకు పడితే చిత్తడే..



తెర్లాం మండలం, సతివాడ గ్రామ రోడ్డు అధ్వానంగా ఉంది. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు..రోడ్డంతా బురదమయమై నడవలేనంతగా తయారవుతుంది. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సతివాడ జంక్షన్ నుంచి తారురోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. పూర్తిస్థాయిలో రోడ్డు పనులు జరగకపోవడంతో ఆ దారిలో రాకపోకలకు జనం ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణం చేయాలని కోరుతున్నారు. -తెర్లాం

ఈత సరదా..ప్రాణం జాగ్రత్త!



సరదా మాటున ప్రమాదం పొంచి ఉంటుంది. అసలే వేసవికాలం..పిల్లలకు సెలవులు. మండుటెండల నుంచి ఉపశమనం పొందేందుకు చాలామంది చెరువులు, కాలువలు, బావులు, నదుల్లో స్నానానికి ఆసక్తి చూపిస్తున్నారు. కొంతమందికి ఈత రాకపోయినా అందరిలా ఆనందించేందుకు నీళ్లలో దిగేందుకు సిద్ధమైపోతారు. దురదృష్టవశాత్తు ఒక్కోసారి ప్రాణాలు కూడా కోల్పోతుంటారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, ఈత సరదా.. సరేగానీ ప్రాణం జాగ్రత్త అని, ఈత కారాదు విషాదం అని సూచిస్తున్నారు. బొబ్బిలి మండలం, పిరిడి గ్రామంలో గురువారం ఇలా బావిలో సరదాగా ఈతకొడుతున్న పిల్లలను చిత్రంలో చూడొచ్చు. -బొబ్బిలిరూరల్

ఊరూరా సత్యసాయి రథోత్సవం



రాజాం సిటీ: గడిముడిదాంలో పుట్టపర్తి నుంచి వచ్చిన రథం వద్ద భక్తుల పూజలు



తెర్లాం: డి.గదబవలసలో సత్యసాయి రథం ఊరేగింపులో భక్తులు

భగవాన్ శ్రీసత్యసాయిబాబా శతజయంత్యుత్సవాల్లో భాగంగా ఊరూరా రథోత్సవం గురువారం నిర్వహించారు. ప్రేమ ప్రవాహిని పేరిట పుట్టపర్తి నుంచి వచ్చిన రథాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులంతా వాహనం వద్దకు చేరుకుని అందులోని సత్యసాయి చిత్రపటానికి పూజలు చేశారు. సత్యసాయి సూచించిన సత్యం, ధర్మం, ప్రేమ మార్గాలను భక్తులు అనుసరించాలని ఆధ్యాత్మిక వక్తలు కోరారు. -రాజాం సిటీ, రేగిడి, తెర్లాం